క్లుప్తంగా

మండుతున్న ఎండలు



మాచర్ల: పట్టణంలో గురువారం ఎండ ప్రభావం తీవ్రమైంది. ప్రజలు వేడిని తట్టుకోలేకపోయారు. మధ్యాహ్నం దాదాపు 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం వరకు వరకు సెగ తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తే విజయం



గురజాల : ఎవరైనా పట్టుదలతో శ్రమిస్తే విజయం వరిస్తుందని రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్ని అవాంతరాలు వచ్చినా చదువును అశ్రద్ధ చేయరాదన్నారు. పల్నాడు ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చిన సమీరా, కావ్యశ్రీ, శృతిలయ అనే విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.

విలువలతో కూడిన బోధన అవసరం



మాచర్ల రూరల్: నైతిక విలువలతో కూడిన విద్యాబోధన అవసరమని మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్ పేర్కొన్నారు. పట్టణంలోని ఓక్ బ్రిడ్జ్ స్కూల్‌లో బుధవారం రాత్రి జరిగిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో అత్యున్నత విద్యాబోధన అందించేందుకు చైర్మన్ కొమ్మారెడ్డి చలమారెడ్డి చేస్తున్న కృషి అమోఘమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ షేక్ దరియా వలి, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్ (రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద షిరిడీ సాయి దేవస్థానంలో సాయిబాబాకు దేవస్థానం ప్రధాన అర్చకుడు గోపాల్ పాండే ఆధ్వర్యంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కితే కోరిన కోరికలు నెరవేరుతాయనే భావంతో పల్నాడు ప్రాంతంలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పూజలు చేస్తుంటారు. దేవస్థానం ఆవరణలో భజనాబృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేసి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా ఆరాధన మహోత్సవం



విజయపురి సౌత్: శ్రీ సత్య సాయి బాబా 14వ ఆరాధన మహోత్సవాలను స్థానిక సాయి ప్రేమ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు హనుమంతచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉగ్రవాదులను వదిలి పెట్టవద్దు



గురజాల: జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన భారతీయులకు సంతాపం వ్యక్తం చేస్తూ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సంతాప దినాల్లో భాగంగా మొదటి రోజు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అంబటి మల్లి, సంయుక్త కార్యదర్శి దూదేకుల ఖాసిం సైదా, పిడుగురాళ్ల మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్, తోట నాగేశ్వరరావు, నేలపల్లి బొల్లయ్య, శరమాళ్ల హనుమంతరావు, సోలస కిషోర్; నెల్లూరి మల్లయ్య, కత్తి ప్రసంగి, జినగా దావీదు కూటమి నాయకులు తదితరులున్నారు.

విరిసిన విద్యాకుసుమాలు

- విద్యాభివృద్ధిలో పల్నాడు సత్తా చాటిన విద్యార్థులు
- రాష్ట్రంలోనే తొలి రెండు ర్యాంకుల్లో నిలిచిన ప్రభుత్వ పాఠశాలలు
- పేద విద్యార్థుల ప్రతిభకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సొంతం



అంగడి పావని చంద్రిక (598)



వి.తేజస్విని (591)

మాచర్ల రూరల్ : విద్య, ఆర్థికపరంగా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న పల్నాటి ప్రాంతంలో వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న కుటుంబాలలో విద్యా కుసుమాలు విరిశాయి. రెక్కాడితే గానీ డొక్కాడని రైతు కూలీలు, చేతి వృత్తుల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి ఇంట మార్కుల పంట పండింది. ఆ ఇళ్లలోని విద్యార్థులే పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు స్టేట్ ఫస్ట్ సహా పలు ర్యాంకులు పొందారు. ప్రైవేటు పాఠశాలలో 590కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు కూడా ఈ విద్యా ప్రగతిలో ముందుకు దూసుకుపోయారు. కారంపూడి మండలం, ఒప్పిచర్ల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని అంగడి పావని చంద్రిక గిరిజన తెగకు చెందిన ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. 600కి గాను 598 మార్కులు పొందింది. హిందీ, ఇంగ్లీషు ఒక్కొక్క మార్కు తగ్గింది. మిగతా అన్నింటిలో నూటికి నూరు మార్కులు సాధించింది. అంగడి పావని చంద్రిక తండ్రి సాంబశివరావు పురపాలక సంఘ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తుంటారు. తల్లి సంధ్య కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటారు. వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడి పోషణ భారంగా మారటంతో ఒప్పిచర్లలో అమ్మమ్మ సంరక్షణలో ఉంటూ దగ్గరలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆ బాలిక చదివింది. ఎటువంటి కోచింగ్ లేకుండా కేవలం తరగతి గదిలో చెప్పిన విద్యనందుకొని స్టేట్ మొదటి ర్యాంకులో నిలిచి పల్నాడు ప్రతిభను రాష్ట్ర స్థాయిలో చాటింది.



596 మార్కులు సాధించిన మాచర్ల పట్టణంలోని జెడ్పీ హెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని షేక్ సమీరాను సన్మానిస్తున్న హెచ్ఎం షేక్ సకీనా, ఉపాధ్యాయులు



593 మార్కులు సాధించిన కె.కావ్యను సన్మానిస్తున్న వెంకటరమణ, శాస్త్రి తదితరులు

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన జెడ్పీ బాలికల పాఠశాల

మాచర్ల పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల నుంచి 596 మార్కులు సాధించిన విద్యార్థిని షేక్ సమీరా తండ్రి సాధారణ మోటార్ మెకానిక్. విద్యా పరంగా అంతంత మాత్రంగా చదువుకొని మోటార్లు రిపేర్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో తమ కుమార్తెను జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో చదివించారు. కేవలం తరగతిలో చెప్పిన పాఠాలు విని పట్టు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశయాలను సాకారం చేసింది.

ప్రగతి పథంలో కంభంపాడు జెడ్పీహెచ్ఎస్

మండలంలోని కంభంపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు షేక్ సాజీదా 584, అజయ్ 582 , పవన్ 569, చరిత 563, హారిక 560 మార్కులను సాధించారు. సాజీదా తండ్రి ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు. తల్లి వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటారు. పేద కుటుంబంలో పుట్టిన సాజీదా 584 మార్కులు సాధించి ప్రతిభను చాటింది.

తల్లి ప్రోత్సాహంతో ..

పట్టణంలోని సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థిని తోటకూర వర్షిణి 590 మార్కులు సాధించింది. మండలంలోని జమ్మలమడక గ్రామం నుంచి మాచర్లకు వచ్చి చదువుకుంది. తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి తోటకూర కుమారి గ్రామంలో పోలేరమ్మ గుడి వద్ద టీ స్టాల్ నిర్వహిస్తుంటారు. తెల్లవారుజామునే 4 గంటలకు లేచి వర్షిణి తల్లికి సహాయం చేస్తుంటుంది. అమ్మమ్మ సహకారంతో చదువుతోంది. తండ్రి లేకపోయినా బాధ్యతగా విద్యనందుకొని 590 మార్కులు సాధించిన వర్షిణిని హెచ్ఎం తుమ్మా సుజాత తదితరులు అభినందించారు.



590 మార్కులు సాధించిన తోటకూర వర్షిణిని అభినందిస్తున్న తుమ్మా సుజాత



సాజీదా (584), అజయ్ (582), పవన్ (569)ను అభినందిస్తున్న హెచ్ఎం విజయకుమారి

ఆర్థిక కష్టాలు అధిగమించి ప్రతిభ చాటిన కావ్య

కిడ్స్ పాఠశాలలో చదువుకున్న కె. కావ్య 593 మార్కులు సాధించింది. తండ్రి వెంకటేశ్వర్లు టిఫిన్ బండి పెట్టుకొని జీవనం కొనసాగిస్తుంటారు. అలాంటి కుటుంబంలో ఆర్థిక కష్టాలను అధిగమించి 593 మార్కులు సాధించిన కావ్యను కేసీపీ జీఎం వెంకటరమణ, ప్రిన్సిపాల్ శాస్త్రి తదితర ప్రముఖులు అభినందించారు.

సత్తా చాటిన తేజస్విని

స్థానిక సత్యసాయి విద్యా విహార్ స్కూల్ విద్యార్థిని వి.తేజస్విని 591 మార్కులు సాధించింది. ఈమె తండ్రి సీతారామరాజు ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తూ కుటుంబ పోషణ చేస్తుంటారు. అలాంటి కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు అధిగమించి చదువులో ప్రతిభ చాటి 591 మార్కులు సాధించింది. తేజస్వినిని పాఠశాల నిర్వాహకులు అక్కినేని అనిల్ కుమార్, జక్కా శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

నేడు ఆలయ భూముల వేలం

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో వేంచేసిన శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం భూములకు శుక్రవారం బహిరంగ వేలం జరగనుంది. స్థానిక దేవస్థానం ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న బహిరంగ వేలం పాటలో పాల్గొన్న వారికి మూడేళ్లపాటు కౌలు హక్కు కల్పించనున్నారు. మొత్తం 17.50 ఎకరాల మెట్ట భూమికి వేలం జరగనుంది.

నేడు ఉచిత వైద్య శిబిరం

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం స్కాలర్స్ స్కూల్‌లో ఉన్నం చారిటబుల్ ట్రస్టు ఉన్నం హాస్పిటల్ (పిడుగురాళ్ల) ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించనున్నారు. చిన్న పిల్లల వైద్యులు ఎం.వెంకట్రామిరెడ్డి, డాక్టర్ పి.సాయి నివేద్ (జనరల్ మెడిసిన్) వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

సత్తెనపల్లి: కిట్స్ సంస్థ (ఎన్జీవో) విజయవాడ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయు జీకేవై కార్యక్రమం ద్వారా జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్ (జెఎస్‌డీ) కోర్సులో 6 నెలల పాటు విజయవాడ సెంటర్‌లో ఉచిత నైపుణ్య శిక్షణ అందించి అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ గురువారం తెలిపారు. కోర్సు వ్యవధి ఆరు నెలలు ఉంటుందని, వయసు 20–30 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. విద్యార్హతలు ఏదైనా డిగ్రీ, పీజీ పాస్/ ఫెయిల్, ఇంజనీరింగ్ పాస్/ ఫెయిల్, కేవలం కంప్యూటర్ బ్యాక్ గ్రౌండ్ విద్యార్థులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించ బడతాయన్నారు. శిక్షణ అనంతరం ప్రతి విద్యార్థికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించ బడతాయన్నారు. వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

శాంతియుత ర్యాలీ వాయిదా

పిడుగురాళ్ల: వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం జరగాల్సిన శాంతియుత ర్యాలీ ఆదివారానికి వాయిదా పడినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని ఐలాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

చిన్నారుల కుటుంబ సభ్యులకు సానుభూతి

పిడుగురాళ్ల / మాచర్ల: మాచవరం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఈతకు వెళ్లి మృతి చెందిన చిన్నారుల కుటుంబానికి గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సానుభూతి తెలియజేశారు. యేసురాజు, జస్వంత్‌లు ఈతకు వెళ్లి మృతి చెందటం ఎంతో బాధ కలిగించిందన్నారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకంపై మరింత శ్రద్ధ పెంచాలన్నారు. వారు ఆడుకునే ఆటలను గమనిస్తుండాలన్నారు. ప్రమాదాలు సంభవించకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లోని వారు మరింత అప్రమత్తంగా ఉండి ఈతలకు వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలని, పెద్ద వారే ఉండే విధంగా చూసుకోవాలని, బావి యజమానులు సైతం చిన్న పిల్లలు ఈతలకు రాకుండా చూసుకోవాలన్నారు. కొత్తపాలెం గ్రామంలో జరిగిన ఘటన చాలా బాధ కలిగించిందని చెప్పారు. యేసురాజు, జస్వంత్ కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

జయరామిరెడ్డి కుటుంబానికి పరామర్శ

గురజాల రూరల్: పార్టీ నాయకుడు పెద్దిరెడ్డి జయరామిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. జయరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాగా, కటారి నరసింహారావు కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. నరసింహారావును కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వెంట వైఎస్సార్ సీపీ అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, వేముల చలమయ్య, కొమ్మినేని బుజ్జి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, కె.ఆంద్రెయ్య తదితరులున్నారు.



జయరామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు

వడదెబ్బకు గురై వ్యవసాయ కూలీ మృతి



మాదల(ముప్పాళ్ళ): వ్యవసాయ పనులకు వెళ్లిన వ్యక్తి పనులు చేస్తూ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందిన ఘటన మండలంలోని మాదల గ్రామంలో గురువారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిరుమలశెట్టి శ్రీకాంత్(36) రోజూ లాగే వ్యవసాయ కూలీ పనులకు వెళ్లాడు. పనుల్లో భాగంగా ధాన్యం బస్తాలు పడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కూలీలు ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతికి వడదెబ్బ కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలోను ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

జన్మదినం రోజే.. అనంత లోకాలకు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల–దీపాలదిన్నెపాలెం గ్రామాల మధ్య గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన చట్టు మహేష్ (24) క్రోసూరులో బజాజ్ మైక్రో ఫైనాన్స్ ఆపరేషన్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం వెళ్లదీస్తున్నాడు. పుట్టినరోజు కావడంతో త్వరగా విధులు ముగించుకొని తిరిగి గుడిపూడిలో ఇంటికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై క్రోసూరు నుంచి రెంటపాళ్ల–దీపాలదిన్నెపాలెం మార్గంలో వెళుతుండగా ఎదురుగా వచ్చిన పాల వాహనం ఢీ కొట్టింది. దీంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ గ్రిడ్ స్థలం పరిశీలన

విజయపురి సౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని మేకల గొంది నుంచి జల జీవన్ మిషన్ ద్వారా మాచర్ల నియోజకవర్గంతోపాటు పల్నాడు ప్రాంతానికి తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో అధికారులు గురువారం సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. గురజాల ఆర్డీవో వి.మురళి కృష్ణ, మార్కాపురం సబ్ డీఎఫ్ఓ వేణుగోపాల్, మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కాశిరెడ్డి, ఇరిగేషన్ జేఈ హిమబిందులు ఆ స్థలాన్ని చూశారు. సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని వాటర్ గ్రిడ్ కోసం కేటాయించేందుకు సాగర్ జలాశయం వద్ద మేకల గొందిలోని ప్రాంతాన్ని గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ఏ ఈ నరేందర్ రెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు, ఫారెస్ట్, రెవెన్యూ, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ, ఇతర అధికారులు

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం



కార్యక్రమంలో ప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు

రెంటచింతల: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని గురువారం ఎంపీడీఓ కె. సరోజినిదేవి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నా పంచాయతీ.. నా గర్వం అనే థీమ్ కింద ప్రతి పంచాయతీ స్థాయి అభివృద్ధిని ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్. గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు

మాచవరం: గ్రామాలు ప్రగతి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్న సిబ్బందిని సన్మానించారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు .

వైభవంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ బ్రహ్మోత్సవాలు



మూలవిరాట్ స్వామికి పూజలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మాచర్ల: ప్రముఖ శ్రీలక్ష్మీ చెన్నకేశవ దేవాలయం బ్రహ్మోత్సవాలు 16వ రోజైన గురువారం ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచే ఆలయంలో మూలవిరాట్‌కు అర్చకులు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి 16 రోజుల పండుగ జరిపారు. వందలాది మంది భక్తులు తరలి వచ్చారు. మధ్యాహ్నం యాగం నిర్వహించారు. ట్రాన్స్‌పోర్ట్ అధినేత గాంధీ ఆధ్వర్యంలో 5 వేల మందికి అన్నదానం నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం



బిల్లంకొండ: విద్యుత్ లైన్లకు సంబంధించిన పనులు చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడు భద్రాచలం ప్రాంతానికి చెందిన కార్మికుడు కేతావతు రవినాయక్(40)గా గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో గత కొద్ది రోజులుగా 24 గంటల వ్యవసాయ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు సంబంధిత కాంట్రాక్టర్ తెలంగాణ నుంచి కార్మికులను తీసుకువచ్చారు. గురువారం రాత్రి పనులు చేస్తుండగా విద్యుత్ స్తంభంపై ఉన్న రవినాయక్‌కు ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్ తగిలి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కార్మికులకు సాధికారత కల్పించేందుకు సమగ్ర సర్వే

సత్తెనపల్లి: అసంఘటిత కార్మికులకు సాధికారత కల్పించేందుకు సమగ్ర సర్వే జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీలో చెత్తను సేకరిస్తూ ఈఎస్ఐ, పీఎఫ్ లేనటువంటి వారు కూడా ఈ సర్వేలో అర్హులని, దానికి సంబంధించిన ఉత్తర్వుల కాపీని గురువారం మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్‌కు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మల్లెల చిన్నప్ప అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనందకుమార్ మాట్లాడుతూ సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో ఉన్న పొడి చెత్తను సేకరించే అసంఘటిత కార్మికుల వ్యక్తిగత వివరాలు, వారి సామర్థ్యాల అంచనా కోసం, సమగ్ర సర్వే నిర్వహించటం జరుగుతుందన్నారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం(నమస్తే) అనేది పొడి వ్యర్థాలను ఏరుకునేవారు, పారిశుద్ధ్య కార్మికులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు, నైపుణ్య మెరుగుదలకు తగిన శిక్షణ అందించడం ద్వారా వారికి సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన పథకమన్నారు. ప్రతి పట్టణంలో అసంఘటిత కార్మికులను 'నమస్తే' పథకం పేరిట ఎన్యూమరేషన్ చేసేందుకు ఒక యాప్‌ను రూపొందించామన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మల్లెల చిన్నప్ప 8 జిల్లాలో ఈ పథకంలో ఎన్యూమరేషన్ చేపట్టనున్నట్లు తెలిపారు. నోడల్ ఆఫీసర్ విజయసారధి ఆధ్వర్యంలో నమస్తే ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందన్నారు.

28 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

అచ్చంపేట: స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయని గ్రంథాలయ శాఖాధికారి బి.నాగ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలియచేశారు. విద్యార్థులకు విజ్ఞాన, వినోదాత్మక, క్రీడా, ఆధ్యాత్మిక విషయాలపై శిక్షణ ఇవ్వబడుతుందని చెప్పారు. అన్ని వర్గాలవారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, ఇతరులెవరైనా ఈ సదవకాశాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు.

రేపు మహంకాళి అమ్మవారి తిరునాళ్ల



మాదల(ముప్పాళ్ళ): భక్తుల పాలిట కొంగు బంగారంగా విలసిల్లే మాదల మహంకాళి అమ్మవారి 45వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 26వ తేదీన జరగనుంది. ఆ మేర అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తిరునాళ్లను పురస్కరించుకొని ఆలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం ఆలయం ముందు పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యంతో పాటు అమ్మవారి దర్శనం చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా శ్రీరామనవమి తర్వాత తిరునాళ్ల నిర్వహించటం ఆనవాయితీ. సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, నరసరావుపేట ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్లలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు.

యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి

అచ్చంపేట: గుర్తు తెలియని వ్యక్తులు యువకునిపై దాడి చేసి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని వేల్పూరులో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ విషయం గురువారం సాయంత్రం వరకు గోప్యంగా ఉంచారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వేల్పూరుకు చెందిన పొన్నెకంటి హరీష్ తన నివాసంలో ఒక్కడే నిద్రిస్తుండగా రాత్రి సుమారు 12 గంటల సమయంలో ఇరువురు వ్యక్తులు లోనికి ప్రవేశించి తీవ్రంగా హింసించారు. వారు పెట్టే హింసలకు సొమ్మసిల్లి పడిపోయిన హరీష్ మూలుగుతూ రాత్రంతా గడిపాడు. తెల్లారి ఇరుగు పొరుగు వారు వచ్చి చూడగా అపస్మారక స్థితిలో హరీష్ కనిపించాడు. విషయాన్ని అచ్చంపేట పోలీసులకు తెలయజేయగా సీఐ సి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీములు అన్వేషణ ప్రారంభించాయి. ఒక్కడే ఉండటాన్ని గమనించి దాడి చేయాల్సిన అవసరం ఏమి వచ్చింది, గాయపరచేందుకే వచ్చారా, ఎవరైనా ఉండవచ్చనే పూర్తి వివరాలు తెలయవలసి ఉంది. సీఐ తనదైన పంథాలో కేసు విచారణ ప్రారంభించారు.